క్లుప్తంగా

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: కల్హేర్ మండలంలోని మీర్‌ఖాన్‌పేట్‌కు చెందిన శివరాంపల్లి భీమయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అదేవిధంగా ఖేడ్ మున్సిపల్ పరిధిలోని మంగల్‌పేట్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పండరి భార్య అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ చందానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గురువారం ఆయా ఆస్పత్రులకు వెళ్లి పరామర్శించారు. ఈ మేరకు బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

కోతుల బెడద నిరోధానికి విరాళం అందజేత

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండల పరిధిలోని జానకంపేట గ్రామంలో కోతుల బెడదను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన బృందానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.3.90లక్షల సొంత నిధులను బుధవారం సర్పంచ్ పాండుయాదవ్‌కు అందజేశారు. కొంతకాలంగా గ్రామంలో కోతుల మూలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామ పంచాయతీ పాలకవర్గం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా శ్రీశైలం ప్రాంతం నుంచి ప్రత్యేకంగా కోతులను పట్టుకునే బృందాన్ని నియమించి వందలాది కోతులను పట్టుకుని శ్రీశైలం అడవుల్లో వదిలిపెట్టారు. గ్రామంలో కోతుల నిరోధానికి సహకారం అందించిన ఎమ్మెల్యేకు సర్పంచ్ పాండు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులు, విద్యుత్ స్తంభాలకు అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు, బోర్డులను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి ఫ్లెక్సీలు, బ్యానర్లు, బోర్డులను ఏర్పాటు చేస్తే తెలంగాణ మున్సిపాలిటీ చట్టం 2019 ప్రకారం భారీ జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నారాయణఖేడ్: వంటగ్యాస్ సిలిండర్ల ప్రమాదాల నివారణపై నారాయణఖేడ్‌లో గురువారం స్థానిక అగ్ని మాపక కేంద్రం ఇన్‌చార్జి సేవ్యానాయక్, సిబ్బందితో కలిసి హోటళ్ల నిర్వాహకులు, గృహాలవారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సేవ్యానాయక్ మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉన్నందునా అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్యాస్ లీకయినప్పుడు విద్యుత్ దీపాలు వెలిగించవద్దన్నారు. గ్యాస్ లీకయితే దుప్పటిని నీళ్లలో ముంచి గాలి ప్రసరించకుండా సిలిండర్ పైభాగంలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది విజయ్ కుమార్, దుర్గయ్య, మారుతి పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

కోహీర్(జహీరాబాద్): మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేశాలని టీఎస్‌ఈడబ్ల్యూ ఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన మన ఊరు మనబడి పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయడంతోపాటు నాణ్యతపట్ల తగు శ్రద్ధ తీసుకోవాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి నిర్మాణాలు అందుబాటులోకి రావాలన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్టు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండి 19 నుంచి 40 సంవత్సరాల వయసు గలిగిన మహిళలు అర్హులన్నారు. జూన్ 5వ తేది నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్హత సర్టిఫికెట్లతో జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 970444 6956, 9490129839కు సంప్రదించాలన్నారు.

26 నుంచి వేసవి శిబిరాలు

సంగారెడ్డి టౌన్: మండల పరిధిలోని పసల్వాదిలోని జ్యోతిర్ వాస్తు విద్యాపీఠంలో విద్యావికాసం పేరుతో ఈ నెల 26 నుంచి 29 వరకు వేసవి శిబిరాలు నిర్వహించనున్నట్టు విద్యాపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ పరమేశ్వర సిద్ధాంతి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆశ్రమంలో కరపత్రాలను ఆవిష్కరించారు. 12 నుంచి 25 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులు శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు.

ధాన్యం డబ్బులు చెల్లించేదెన్నడో?

- కేంద్రంలోనే నిల్వ ఉన్న వరి ధాన్యం
- ధాన్యం తరలింపులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- జోగిపేటలో రైతుల రాస్తారోకో



జోగిపేట జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

జోగిపేట(అందోల్): వరి ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే డబ్బులు రైతుల అకౌంట్‌లో వేస్తామని అధికారులు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. వారం రోజులైనా ధాన్యం డబ్బులు అందకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. దీంతో అధికారుల తీరును ఆగ్రహం చేస్తూ గురువారం జోగిపేట జాతీయ రహదారిపై ఆయా గ్రామాల రైతులు రాస్తారోకో చేపట్టారు.

- అందోల్ సొసైటీ ఆధ్వర్యంలో అందోల్, జోగిపేటలతో పాటు ఆయా గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.
- జోగిపేట మార్కెట్ యార్డులో ఈ నెల 3వ తేది నుంచి వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు.
- ఇప్పటివరకు జోగిపేట, అన్నాసాగర్ ప్రాంతాలకు చెందిన 8245 సంచుల ధాన్యంను కొనుగోలు చేశారు. కానీ..6045 సంచుల ధాన్యంను మాత్రమే రైస్‌మిల్‌లకు తరలించారు.
- వారం రోజులుగా సేకరించిన ధాన్యంను రైస్ మిల్‌లకు తరలించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రెండు వేలకు పైగా ధాన్యం బస్తాలు కేంద్రం ఆవరణలోనే ఉన్నాయి.
- 3, 4 రోజుల్లో ధాన్యం డబ్బులు అకౌంట్‌లలో వేస్తామని చెప్పినా డబ్బులు వేయకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రం నిర్వాహకులను నీలదీయగా కాంట్రాక్టర్ లారీలు పంపకపోవడంతో ధాన్యంను రైస్‌మిల్లర్లకు పంపలేకపోతున్నామని, దీంతో ధాన్యంను కొనుగోలు చేయడాన్ని నిలిపివేసిట్లు సమాధానం ఇస్తున్నారు.

జాతీయ రహదారిపై...

ధాన్యం విక్రయించి వారం రోజులు గడుస్తున్నా డబ్బులు ఖాతాలోకి రాకపోవడంతో ఆగ్రహించిన జోగిపేట, అన్నాసాగర్ రైతులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సామ్యానాయక్ ఉప తహసీల్దార్ మధుకర్‌రెడ్డి అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు తమ నిరసనను విరమించారు.

ధాన్యం డబ్బులు వెంటనే ఇవ్వాలి

ధాన్యం తీసుకువచ్చి వారం రోజులు అవుతోంది. కానీ.. రైస్ మిల్లర్‌లకు తరలించకపోవడంతో రావడంలేదు. వారం రోజుల నుంచి కొనుగోలు కేంద్రానికి లారీలు రాకపోవడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం డబ్బులు వెంటనే ఇప్పించాలి.



– ఆకుల శ్రీనివాస్, రైతు, జోగిపేట

జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాం

జోగిపేటలోని కొనుగోలు కేంద్రంలో రెండువేలకు పైగా ధాన్యం బస్తాలు నిల్వ ఉన్నాయి. లారీలు రావడంలేని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటివరకు 8245 బస్తాలు కొనుగోలు చేశాం. లారీలు రాగానే ధాన్యంను రైస్‌మిల్‌కు పంపుతాం. రైతులకు త్వరగా డబ్బులు అందేవిధంగా చర్యలు తీసుకుంటాం.



– నర్సింలు, సీఈఓ, డీసీసీబీ, జోగిపేట

వీఓఏలపై వేధింపులు ఆపాలి



ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న వీఓఏలు

జహీరాబాద్ టౌన్: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న వీఓఏలపై అధికారులు వేధిస్తున్నారని, వారిపై వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ అన్నారు. అధికారుల నుంచి వేధింపులకు గురిచేస్తున్నారని గురువారం ఆర్డీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏల సమస్యలను పరిష్కరించకుండా వారిని వేధించడం సరికాదన్నారు. ప్రభుత్వం వీఓఏలపట్ల చిన్నచూపు చూస్తుందని, కనీసం చర్చలకు కూడా పిలవడంలేదన్నారు. సమ్మె విరమణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనియెడల వీఓఏల తరపున సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ డివిజన్ పరిధిలోని జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్, కోహీర్ మండలాల వీఓఏలు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): మహిళా రెజ్లర్లపై లైంగికంగా వేధించిన ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద మహిళా రెజ్లర్లలకు సంఘీభావంగా కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని నాలుగు నెలలుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్నా ప్రధానమంత్రి నరేంద్రమోడీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. భేటీ బచావో బేటి పడావో నినాదం ఇచ్చిన మోడీ మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలనే ఆలోచన ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు? రెజర్లకు మద్దతుగా పోరాడుతున్న వారిపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడడం మానుకోవాలని హితవు పలికారు. తక్షణమే బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మాణిక్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యాదవరెడ్డి, ప్రజాసంఘాల నాయకులు అశోక్, నగేష్, రాజిరెడ్డి, మైపాల్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ముగిసిన సీఎం కప్ క్రీడలు



ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం మైత్రి మైదానంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు హాజరై విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లా స్థాయి పోటీలో పాల్గొనే క్రీడాకారులకు సొంత నిధులతో ట్రాక్స్ అందజేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, కార్పొరేటర్ కుమార్‌యాదవ్, అమీన్‌పూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణాలకు విరాళం అందజేత

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ హరివిల్లు కాలనీలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయం, బీఎస్ఆర్ కాలనీలో నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయాల నిర్మాణాలకు రూ.5లక్షల చొప్పున 10 లక్షలను విరాళంగా బుధవారం పటేల్‌గూడలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. దేవాలయాల నిర్మాణానికి విరాళం అందించడంపై కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సర్పంచులు నితీషాశ్రీకాంత్, భాస్కర్‌గౌడ్, కృష్ణ, పాండు, సీనియర్ నాయకులు రాజు, మల్లేష్, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, గోవిందు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పాటు పరిశ్రమల సహకారంతో సీఎస్ఆర్ నిధులు సమకూరుస్తూ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ ప్రకాశ్‌చారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం న్యాయం చేయాలి



కోహీర్ ర్యాలీ నిర్వహించిన రైతులు

కోహీర్(జహీరాబాద్): తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను ఏ ఆధారం లేకుండా వక్ఫ్ బోర్డు భూములని బ్లాక్ లీస్టులో పెట్టడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కోహీర్ పట్టణంలోని రైతు వేదిక నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భాదిత రైతులు మాట్లాడుతూ మండలంలో 6 వేల ఎకరాల భూమి ధరణిలో వక్ఫ్ ఆస్తులుగా గుర్తించి భూమిపత్రాల జారీని నిలిపివేశారన్నారు. 2018 ధరణి వచ్చినప్పటి నుంచి తమ కష్టాలు ప్రారంభమయ్యాయని వాపోయారు. తమకు రైతు బంధు, రైతుభీమా అందడంలేదన్నారు. భూముల క్రయ విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయని, బ్యాంకులో రుణాలు తీసుకోవడానికి సైతం వీలులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాత ముత్తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్న తమకు వెంటనే పట్టాపాసుపుస్తకాలు జారీ చేసి సదరు భూములపై పూర్తి హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శిఖర ప్రతిష్ఠాపన

జహీరాబాద్ టౌన్: అల్గోల్ రోడ్డులోని సిద్దేశ్వర ఆలయంలో శిఖర ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం శనిశ్వేర విగ్రహాభిషేకం, యంత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మంగళ హారతి, మహాప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాలుడి అదృశ్యం

సంగారెడ్డి టౌన్: బాలుడు అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన యాదుల్ తన కుమారుడు ఎక్బాల్ (14)తో కలిసి గత వారం ఆర్సీపురం వెళ్లి గురువారం తిరిగి వస్తున్నాడు. తనకు పని ఉండటంతో సంగారెడ్డి నుంచి ఎక్బాల్ ను బాబాయ్‌తో ఇంటికి వెళ్లమన్నాడు. పోతిరెడ్డి పల్లి చౌరస్తాలోని రియాన్ హోటల్ వద్ద దిగాడని ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిస్తే 8712656746 నంబర్‌కు తెలపాలన్నారు.

బాలుడిపై కత్తితో దాడి



గాయపడిన బాలుడు సిద్దు

కల్హేర్(నారాయణఖేడ్): సైకో చేతిలో బాలుడు(8) కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మాసాన్‌పల్లి బుగ్యనాయక్ తండాలో గురువారం జరిగింది. తండాకు చెందిన ధరావత్ జైపాల్ మతిస్థిమితం బాగాలేక కొంతకాలంగా సైకోగా ప్రవర్తిస్తున్నాడు. తండాకు చెందిన శంకర్‌నాయక్ కుమారుడు సిద్దు(చింటు) ఇంటి ముందు ఆడుకుంటుండగా జైపాల్ అకస్మాత్తుగా కత్తితో దాడి చేశాడు. బాలుడి మెడ, గొంతును కత్తితో కోశాడు. ఇది చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. తండా వాసులు వెంటనే బాలుడిని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన జైపాల్ బాలుడికి వరుసకు చిన్న నాన్న అవుతాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

సాయిబాబా ఆలయంలో భక్తజన సందోహం



బాబాను దర్శించుకుంటున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని షిర్డిసాయిబాబా ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను వితరణ చేసి భక్తులకు అన్నదానం చేశారు.

పంచాయతీ సెక్రటరీ జయరాం సస్పెన్షన్

కంగ్టి(నారాయణఖేడ్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్యం కార్యక్రమానికి కంగ్టి మండలంలోని బోర్గి గ్రామ పంచాయతీకి చెందిన జయరాం అనధికారంగా గైర్హాజరయ్యారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ సెక్రటరీని సస్పెన్షన్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు పంచాయతీ జిల్లా అధికారి సురేష్‌మోహన్ తెలిపారు. బుధవారం డీఎల్‌పీఓ సంజీవ్ రావు, ఎంపీఓ ఇబ్రహీం గ్రామ పంచాయతీల ఆకస్మిక తనిఖీలు చేయగా జయరాం గైర్హాజరు అయినట్లు సమాచారం.

సంక్షిప్త వార్తలు

◆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కార్పొరేటర్ పుష్పనగేష్, భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డిలు అన్నారు. గురువారం రామచంద్రాపురం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఆసుపత్రిలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజకుమారి సిబ్బంది పాల్గొన్నారు.

◆ కంటివెలుగు పథకం దేశానికే ఆదర్శం

జిన్నారం(పటాన్‌చెరు): కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామంలో గురువారం కంటి వెలుగు శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్లను స్థానిక నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్, వార్డుసభ్యులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్ విజయ అనారోగ్యానికి గురై రెండు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి విజయ గురువారం మృతి చెందింది. విజయ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. అంగన్‌వాడీ టీచర్స్ మండల యూనియన్ ఆధ్వర్యంలో తోటి అంగన్‌వాడీ టీచర్లు విజయ అంత్యక్రియల నిమిత్తం రూ.12వేలను అందజేశారు.

◆ ముగిసిన ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ముబారక్ పూర్(ఎ) గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

◆ కంటివెలుగు శిబిరం ప్రారంభం

మునిపల్లి(అందోల్): కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వీరన్నపాటిల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చిలపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేసుకున్న వారికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ లక్ష్మి నగేష్, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రం వర్కర్లు పాల్గొన్నారు.

◆ సాయిబాబా ఆలయంలో పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇబ్రహీంబాద్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోడూరి రాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ దోస్త్ మొదటి దశ ప్రవేశాలు ప్రారంభం

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ మొదటి దశ ఆన్‌లైన్ ప్రవేశాలు 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి జూన్ 10 వరకు ముగుస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ పతంజలి తెలిపారు. విద్యార్థులకు ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

◆ జగదాంబమాతకు ప్రత్యేక పూజలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలోని గుడితండాలో జగదాంబదేవి ఆలయంలో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు గురువారం సంగారెడ్డి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు, దేశ్‌పాండే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంగారెడ్డి మండల అధ్యక్షులు పాపన్న, అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, సర్పంచ్ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణంలోని భవాని భువనేశ్వరీ దేవాలయం వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవానిశంకరుల కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

◆ నిధులు మంజూరు చేయాలని వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో డ్రైనేజీల సమస్య తీవ్రంగా ఉందని, నూతన పైపులైన్‌ల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం కార్పొరేటర్ పుష్పనగేష్ జలమండలి జీఎం రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వివిధ సందర్భాల్లో కాలనీలలో పర్యటించిన సమయంలో కాలనీవాసులు డ్రైనేజీ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, ఆర్‌టీసీ డిపో మార్గంలో నూతన డ్రైనేజీ పైపులైన్ మంజూరై నెలలు గడుస్తున్నా పనులను ప్రారంభించలేదని జీఎంకు వివరించగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బూరుగడ్డ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ 327 యూనియన్‌లో చేరిక

సంగారెడ్డి మున్సిపాలిటీ: 1104 యూనియన్ నుంచి కొందరు ఉద్యోగులు ఎస్‌డీసీఎల్ 327 యూనియన్‌లో చేరినట్లు నాయకులు భూపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం సంగారెడ్డిలో నిర్వహించిన ఎస్‌పీడీసీ కంపెనీ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టేట్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ సమక్షంలో చేరారు. యూనియన్‌లో చేరిన వారిలో సయ్యద్ హుస్సేన్, విజయ్‌కుమార్, రామరాజు, రమేష్, కిషన్, శివప్రసాద్, శివశంకర్ ఎస్‌కె రఫీ, మణికంఠరెడ్డి ఉన్నారు.

◆ రేపటి నుంచి దేవతామూర్తుల పున:ప్రతిష్ఠాపన ఉత్సవాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గుంజోటి గ్రామంలో ఈనెల 20 నుంచి 24 ఉరడమ్మ, పోచమ్మ, అంజనేయస్వామి, నింగమయ్య తదితర విగ్రహామూర్తుల పున:ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

◆ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో ప్రవేశాలకు 2023, 24 సంవత్సరానికి గానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఎంపికకు అవకాశముందని తెలిపారు. దరఖాస్తుల కోసం httpr://iti.tea nfana.gov.in వెబ్సైట్లో చూడాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ నేడు దత్తగిరిలో శనీశ్వర జయంతి

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో శుక్రవారం శనీశ్వర జయంతిని నిర్వహించనున్నట్లు ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామని అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వరస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనీశ్వర జయంతికి భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

◆ కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

కోహీర్(జహీరాబాద్): కంటివెలుగు శిబిరాలను ప్రజలు సద్వియోగం చేసుకోవాలని సర్పంచ్ బంటు తుల్జమ్మ అన్నారు. గురువారం పర్సపల్లి గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి లావయ్య, ఉపసర్పంచ్ రుక్కమ్మ, వైద్య సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలోని ఇటుక బట్టీలలో పనులు చేస్తున్న కార్మికులకు ఏఎస్‌ఐ మల్లేశ్ ఆధ్వర్యంలో బుధవారం ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగిస్తున్న ప్రతిఒక్కరూ ఎలాంటి ఫేక్‌కాల్స్‌కు సమాచారం ఇవ్వొద్దని, అనవసరమైన లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఇటుకబట్టీల యాజమానులు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆస్పత్రి సందర్శన



వైద్యులతో మాట్లాడుతున్న సంగారెడ్డి

జహీరాబాద్: జహీరాబాద్‌లోని ఏరియా ప్రభుత్వాస్పత్రిని బుధవారం డీసీ హెచ్ఎస్ సంగారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వహణ పనితీరును పరిశీలించారు. ఓపీ వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషుతో పాటు వైద్యులు, నర్సులు, సిబ్బందితో సమావేశమయ్యారు.

పనుల్లో నాణ్యత లోపించొద్దు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ కుమార్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో రూ.50లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం కుమార్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో కొత్త మండలంగా ఏర్పాటైన గుమ్మడిదల అభివృద్ధిలో ముందడుగు వేస్తోందని తెలిపారు. న్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అన్ని గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అన్నారంలో రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురళి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు హుస్సేన్, ఉపసర్పంచ్ శేఖర్‌లతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బొల్లారం పీఎస్ సందర్శన

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం పీఎస్‌ను డీఎస్పీ భీంరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీఎస్‌లోని రికార్డులు, ఫైళ్లను డీఎస్పీ పరిశీలించారు. నమోదవుతున్న కేసుల వివరాలను సీఐ సురేందర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పీఎస్ నిర్వహణపై డీఎస్పీ భీంరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎరువుల దుకాణం తనిఖీ

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని ధనలక్ష్మి ఎరువులు, పురుగుమందుల విక్రయ దుకాణాన్ని బుధవారం వ్యవసాయ శాఖ మండల అధికారి లావణ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణంలో నిల్వ ఉన్న విత్తనాలు, మందులను తనిఖీ చేశారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. విత్తనాలు, ఎరువుల ధరలకు సంబంధించిన రేట్లను బోర్డుపై రాసి ఉంచాలని సూచించారు.

సంతూర్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



విద్యార్థులకు పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

నారాయణఖేడ్: ప్రభుత్వ డిగ్రీ కళాశాకు చెందిన ఇద్దరు విద్యార్థులు సంతూర్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు రోహిత, శిరీషలకు ప్రతి సంత్సరం రూ.24వేల చొప్పున మూడు సంవత్సరాలకు గాను రూ.72వేలను విద్యార్థి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఉపాధిహామీ బిల్లులు చెల్లించాలి

నారాయణఖేడ్: ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీలు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీంద ర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ రోడ్లు తదితర పనులు చేసిన వారికి గత 15 నెలలుగా కేంద్ర ప్రభుత్వ బిల్లులకు సంబంధించిన నిధులు విడుదల చేయడంలేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో బుధవారం మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో గ్రామీణ స్థాయి క్రీడాకారులు నేడు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. సీఎం కప్ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సునీతాసత్యనారాయణ, సర్పంచులు కృష్ణ, నీతిశ శ్రీకాంత్, భాస్కర్‌గౌడ్, మాధవిరవి, లలిత మల్లేష్, మల్లేష్, సీఐ శ్రీనివాసులురెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ సుజాత, ఎంపీడీఓ మల్లీశ్వర్, ఎంఈఓ రాథోడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్, ఐలాపూర్ తండాలో గ్రామాల్లో రూ.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ ప్రాంతాలు.. నేడు అభివృద్ధికి కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాలను, తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచులు మాధవి రవి, మల్లేష్, కృష్ణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



మునిపల్లిలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

మునిపల్లి(అందోల్): యువత క్రీడల్లో రాణించాలని జెడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్ అన్నారు. బుధవారం మునిపల్లిలో సీఎం కప్ క్రీడాపోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఖమ్రోద్దీన్, మునిపల్లి సర్పంచ్ రమేశ్, కంకోల్ సర్పంచ్ విశ్వనాథం, తహసీల్దార్ శివకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 3, 4,వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కష్టారెడ్డి, వైస్‌చైర్మన్ చింతా ప్రభాకర్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, ఆకుల శివకుమార్, శ్రీనివాస్, చౌదరి ప్రకాష్, ఇంద్రమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ చోఖామేళా ఉత్సవాలు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని సత్యసాయికాలనీలోని భగవాన్ సత్యసాయి నిలయంలో బుధవారం సంత్ చోఖామేళా సమాధి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పురవీధుల గుండా దిండి శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు చైర్మన్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్, అంబేడ్కర్, పూలే సేవా సమితి ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రహీం, పండరిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.



దిండి శోభయాత్రలో భక్తులు

రైతులు దళారులను ఆశ్రయించొద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రత్నాకర్‌రెడ్డి

సదాశివపేట (సంగారెడ్డి): రైతులు దళారులను ఆశ్రయించొద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతుబంధు మండల అధ్యక్షులు అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ఏఓ అనిత, వ్యవసాయ అధికారి విజయకుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ గడిల సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల వనం



వనంలో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలోని 13వ వార్డు గీతానగర్ కాలనీలో పట్టణ ప్రకృతి వనం ఉంది. ఇందులో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. దీంతో ప్రకృతి వనానికి సేదతీరేందుకు వచ్చే చిన్నా పెద్ద ఇబ్బందిపడుతున్నారు. వనంలో క్రిమికీటకాలుండటంతో సందర్శకులు రావడానికి జంకుతున్నారు. డైలీ వాకింగ్‌కు వచ్చేవారు కీటకాలు ఎక్కడ కాటువేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ముగిసిన సీఎం కప్ క్రీడల పోటీలు

జోగిపేట(అందోల్): మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ బాలయ్య, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈవో కృష్ణ, మండల ప్రత్యేక అధికారి గీత, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, వైస్‌చైర్మన్ డేవిడ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆడవిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోటీలో గెలుపొందిన విజేతలు..

కబడ్డీ పోటీలలో 4 టీంలు పాల్గొనగా ప్రథమ స్థానంలో జోగిపేట, ద్వితీయ స్థానంలో అందోల్, ఖోఖో పోటీలలో 3 టీంలు పాల్గొనగా ప్రథమ స్థానంలో డాకూర్, ద్వితీయ స్థానంలో అందోల్, వాలీబాల్ పోటీలకు 6 టీంలు రాగా, ప్రథమ స్థానంలో కొండారెడ్డిపల్లి, ద్వితీయ స్థానంలో తాడ్మన్నూర్ గ్రామాలు విజేతలుగా నిలిచాయి. అథ్లెటిక్స్‌లోని 100 మీటర్ల పరుగు పందెంలో బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో మహేందర్, ద్వితీయ స్థానంలో జోజార్జ్, 400 మీటర్ల పోటీలో ప్రథమ స్థానంలో శ్రవణ్‌కుమార్, ద్వితీయ స్థానంలో మహేందర్, బాలికల విభాగంలో 100 మీటర్ల పోటీలో ప్రథమ స్థానంలో రాజేశ్వరీ, ద్వితీయ స్థానంలో స్వాతి, 400 మీటర్ల పోటీలో ప్రథమ స్థానంలో రాజేశ్వరీ, ద్వితీయ స్థానంలో వైష్ణవిలు గెలుపొందారు.

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల అవరణలో నిర్వహించిన మండలస్థాయి సీఎం కప్ క్రీడల పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎంపీపీ యాదమ్మ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

జహీరాబాద్ టౌన్‌లో..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రంజోల్ గురుకులంలో నిర్వహించిన క్రీడల పోటీలలో 225 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి ప్రత్యేక అధికారి వసంత కుమారి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, ఎంపీఓ మహేష్, ఎంఈఓ. బస్వరాజ్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



జోగిపేట: విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్

విజేతలకు బహుమతులు ప్రదానం

కోహీర్(జహీరాబాద్): సీఎం కప్ క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ మాధవి, ఎంపీడీఓ సుజాతనాయక్ బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్ పోటీలో కోహీర్ జట్టు విజేతగా నిలువగా బిలాల్‌పూర్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. కబడ్డీ పోటీల్లో పైడిగుమ్మల్, దిగ్వాల్ జట్లు ప్రతిభ చాటి విన్నర్, రన్నర్‌గా నిలిచాయి. షార్ట్ పుట్ మహిళా విభాగంలో ధనలక్ష్మి మొదటి స్థానం సాధించింది. పురుషుల విభాగంలో శ్రీనివాస్ సజ్జాపూర్ మొదటిస్థానంలో, కోహీర్ నివాసి సయ్యద్ ఎక్బాస్ రెండో స్థానంలో నిలిచాడు. 100 మీటర్ల పరుగు పందెంలో రాజ్‌కుమార్ ద్విగాల్, సంతోష్ కోహీర్ మొదటి రెండు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. 400 మీటర్ల రన్నింగ్‌లో కోహీర్ పట్టణానికి చెందిన ముస్తాకిన్, సంతోష్ విజయం సాధించారు. మహిళల 100, 400 మీటర్ల విభాగంలో ధనలక్ష్మి విజేతగా నిలిచి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకొంది. బహుమతి ప్రదానోత్సవంలో ఎంపీపీ మాధవి, ఎంపీడీఓ సుజాతనాయక్, ఎంపీపీ ఉపాధ్యక్షులు షాకీర్‌అలీ, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

రాయికోడ్‌లో...

రాయికోడ్(అందోల్): మండలంలోని నాగ్వార్ సమీపంలో నిర్వహించిన సీఎం కప్ విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్ పోటీల్లో పీపడ్‌పల్లి జట్టు విన్నర్‌గా నిలవగా నాగ్వార్ జట్టు రన్నర్‌గా నిలిచింది. కబడ్డీ పోటీల్లో విజేతగా నల్లంపల్లి రన్నర్‌గా నాగ్వార్ జట్లు నిలిచాయి. ఖోఖో పోటీల్లో హుల్గేర జట్టు విన్నర్‌గా నిలవగా నాగ్వార్ జట్టు రన్నర్‌గా నిలిచింది. జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, ఎంపీపీ మమత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్‌పాటిల్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశం, సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్, కోఆప్షన్ సభ్యుడు అబేద్ మియా పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో...

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలో మూడు రోజులుగా నిర్వహించిన సీఎం కప్ క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. వాలీబాల్‌లో మొదటి బహుమతి బిర్జాపూర్(బి)జట్టు దక్కించుకోగా రెండో బహుమతి బసంత్‌పూర్ దక్కించుకుంది. కబడ్డీలో మొదటి బహుమతి హద్నూర్‌కు లభించగా రెండవ బహుమతి మెరియంపూర్‌కు లభించింది. ఖోఖోలో హద్నూర్, మెటల్‌కుంటకు రెండు జట్లు సమాన ప్రతిభను కనబర్చడంతో ఇరు జట్లు ప్రథమ బహుమతిని గెలుచుకున్నాయి. రన్నింగ్‌లో 100 మీటర్లు, 400 మీటర్లలో గెలుపొందిన సంతోష్‌రెడ్డి, బాల్‌రాజ్, ప్రవీన్‌కుమార్‌కు బహుమతులు లభించాయి. ప్రతిభ కనబర్చిన వారికి జహీరాబాద్ డీఎల్‌పీఓ రాఘవరావు, రూరల్ సీఐ వెంకటేశం, ఎంపీపీ అంజమ్మ, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఎంఈఓ మారుతిరాథోడ్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సలీం, సబ్బీర్‌మియా, నాగభూషణం, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఈశ్వరయ్య కుటుంబానికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): సాక్షిలో ఈనెల 15వ తేదీన ప్రచురితమైన 'ఇంటి నిండా కష్టాలే' అన్న శీర్షికకు స్పందించి దాతలు ఈశ్వరయ్య కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వస్తున్నారు. అనారోగ్యంతో ఉన్న మహేశ్, రమేశ్‌లకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాంరెడ్డి కూతురు సింగూరు ఏడీఈ సౌజన్య తరపున బుధవారం రూ.10 వేల చెక్కును ఈశ్వరయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదాగౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ముంగి పరిశ్రమ ఎన్నికల్లో రాములు విజయం

జహీరాబాద్ టౌన్: ముంగి పరిశ్రమలో బుధవారం కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు జరిగాయి. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, ఎంఆర్ఎఫ్ పరిశ్రమ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంజీ రాములు ముంగి యాక్టివ్ ఎంప్లా యిస్ యూనియన్ బ్యానర్‌పై పోటీ చేశారు. ఆయనకు పోటీగా బీఎంఎస్ అభ్యర్థి మల్లేశంలో ఎన్నికల్లో నిలిచారు. 63 ఓట్లు పోల్ కాగా ఎంజీ రాములుకు 40 ఓట్లు, మల్లేశంకు 23 ఓట్లు వచ్చాయి. రాములు 17 ఓట్ల తేడాతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు వక్ఫ్ బాధితుల ఆందోళన**

కోహీర్(జహీరాబాద్): వక్ఫ్ బోర్డు బాధిత రైతుల ఆందోళనను గురువారం నిర్వహించనున్నట్లు వక్ఫ్ బోర్డు భూములు పరిరక్షణ కమిటీ సభ్యులు గణేష్ రెడ్డి తెలిపారు. కోహీర్ పట్టణంలోని రైతు వేదిక నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బాధిత రైతులతో ర్యాలీ నిర్వహించి మెమోరండం సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమానికి బాధిత రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

◆ **ఇన్‌చార్జీ డీఎంగా మల్లేశం**

జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ జహీరాబాద్ డీపో ఇన్‌చార్జ్ డీఎంగా మల్లేశం బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. డిపో మేనేజర్‌గా ఉన్న రజనీకృష్ణ సెలవులపై వెళ్లడంతో నారాయణఖేడ్ డిపో డీఎంగా ఉన్న మల్లేశంకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

◆ **బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాంబాబుగౌడ్**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లి చెందిన రాంబాబుగౌడ్ నియమితులైనట్లు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబుగౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పవన్ ముదిరాజ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

◆ **విరాళం అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ నిర్మాణానికి విశ్వకర్మ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణమూర్తిచారి, నాయకులు రాజేందర్‌చారిలు రూ.50వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ నిర్మాణ నిర్వాహకులు భరత్‌చారి, నాయకులు విఠల్‌చారి, అంజయ్యచారి, వెంకటేశ్‌చారి, అశోక్‌చారి, విష్ణుచారి, కళ్యాణ్‌చారి పాల్గొన్నారు.

◆ **పరీక్షలు ప్రశాంతం**

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లోని మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లమా కోర్సుతో పాటు వ్యవసాయ వెటర్నరీ డిప్లమాలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 3613 మంది విద్యార్థులకు 3390 మంది విద్యార్థులు హాజరుకాగా 223 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

◆ **ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గౌడ సంఘం నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. పట్టణంలోని శ్రీనివాస్ మహల్‌లో బుధవారం నియోకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా ఎలాంటి బెనిఫిట్స్ వచ్చినా వాటిని అర్హులైన గౌడ కులస్తులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ మేరకు ఓ కమిటీని ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌడ్ కులస్తుల బెనిఫిట్ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మురళీకృష్ణగౌడ్, అధ్యక్షుడు మానిక్‌ప్రభుగౌడ్, ఉపాధ్యక్షులుగా విఠల్‌గౌడ్, దత్తుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింలుగౌడ్, సంయుక్త కార్యదర్శులుగా గణేష్‌గౌడ్, సంతోష్‌గౌడ్, కోశాధికారిగా నర్సింలు, సభ్యులుగా లక్ష్మయ్య, రంగయ్య, రాజుగౌడ్, శేఖర్, నారాయణగౌడ్, కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

◆ **డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి**

పటాన్‌చెరు టౌన్: రాజకీయ నాయకులు, బిల్డర్ల చేతిలో మోసపోయిన అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ గ్రామం, ఐలాపూర్ తండా బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని నవభారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

◆ **మహార్యాలీని విజయవంతం చేయాలి**

జహీరాబాద్ టౌన్: హైదరాబాద్‌లో జూన్ 4న తెలంగాణ లింగాయత్ సమన్వయ సమితి ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన మహార్యాలీని విజయవంతం చేయాలని బుధవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బసవకళ్యాణ్ పీఠాధిపతితో పాటు అక్కనబళగ సభ్యులు పట్టణంలోని ఆదర్శనగర్‌లో లింగాయత్ సమాజ్ ఇళ్లకు వెళ్లి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

◆ **సమస్యల పరిష్కారానికి కృషి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్‌లో బుధవారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ పుష్పనగేష్‌కు వివరించారు. కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. రోడ్లపై నీరు నిలుస్తోందన్నారు. అనంతరం కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

◆ **మార్కెట్ కమిటీ నూతన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మర్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్‌ను ప్రవీణ్‌కుమార్ కలసి జాయినింగ్ ఆర్డర్‌ను అందజేశారు. ఇంతకుముందు మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ మహబూబ్ కార్యదర్శిగా వ్యవరించగా ప్రస్తుతం నూతన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్ ఇప్పటినుంచి మార్కెట్ వ్యవహారాలను చూడనున్నారు.

◆ **రేణుకాఎల్లమ్మ ప్రతిష్ఠ మహోత్సవం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ముబారక్ పూర్(ఎ) గ్రామంలో రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, మండల అధ్యక్షుడు చాట్ల సిద్దన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

◆ **డిప్యూటీ తహసీల్దార్‌కు సన్మానం**

న్యాల్‌కల్(జహీరాబాద్): నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా నియమితులైన మునిరోద్దీన్‌ను బీఆర్‌ఎస్ మండల నాయకులు ఎండీ హనీఫ్, వీరారెడ్డి సన్మానించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్లు విజయలక్ష్మి, తహసీల్దార్ అంటోనీ ఇటీవల బదిలీ అయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ స్థానంలో మునిరోద్దీన్ జహీరాబాద్ ఆర్‌డీఓ కార్యాలయం నుంచి ఇక్కడికి వచ్చారు. తహసీల్దార్ స్థానంలో ఎవరూ రాకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్లుగా అదనపు బాధ్యతలు చేపట్టారు.

◆ **తాగునీటి సదుపాయం కల్పించాలి**

నారాయణఖేడ్: ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు పనిచేస్తున్న చోట తాగునీటి సదుపాయం కల్పించాలని సీపీఐ ఖేడ్ డివిజన్ కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లో బుధవారం జరిగిన పార్టీ డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎండలు మండుతుండగా కూలీలకు తాగునీరు, టెంటు సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఉపాధికూలీలకు వసతులు కల్పించాలని కోరారు. నాయకులు ప్రవీణ్‌కుమార్, ఇసాక్, రాజు, పెంటయ్య, నవీన్ పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**



నారాయణఖేడ్: కంగ్టి పంచాయతీ 8వ వార్డు సభ్యులు నాగూరు విఠల్‌తో పాటు 20మంది యువకులు బుధవారం నారాయణఖేడ్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి ఆ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.